RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 12 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 16-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

### నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

గుట్టునెపుడుగూడ గుప్తముగా నుంచు
పరువునిలుపు కొనగ పద్ధతిదియె
పరులకు తెలుపుటకు తిరుబోనమును గాదు
మరచిపోకుమయ్య మహిన నరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



## పెట్రోల్,డీజిల్ ధరల పెంపు

- లీటర్‌పై కనీసంగా రూ.3 పెంపు
- శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి.
- ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం

న్యూఢిల్లీ,
ఊహించినట్లుగానే.. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ.. ప్రభుత్వరంగ చమురు కంపెనీలు దాదాపు 11 వారాల పాటు ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో -మిగతా 2 లో




## నీట్ రీఎగ్జామ్..

**జూన్ 21న నిర్వహణ**

- అదే నెల 14 నుంచి విద్యార్థులకు అడ్మిట్ కార్డులు
- ఉచితంగానే రీ ఎగ్జామ్‌కు అందరికీ ఎంట్రీ
- వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లోనే పరీక్ష
- ఎంట్రన్స్ పరీక్షల్లో సమూల మార్పులు
- విద్యార్థులకు భరోసా ఇచ్చిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర

2 లో

**గతంలో ఎగ్జామ్ రాసిన వారికి ఫీజు రిటర్న్**

## 2034 వరకు నేనే ముఖ్యమంత్రి

### ఆ తరవాత జాతీయ రాజకీయాల్లోకి వెళతా



- రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తా
- రాహుల్ తరవాత సెకండ్ ప్లేస్ ఆక్రమిస్తా
- దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యం
- కాని ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదు
- గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉంది
- పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తా
- రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటా
- సీఎం రేవంత్ రెడ్డి మరోమార్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదని.. ఆ పదవికి పోటీ పడాలని తాను ఒప్పించానని రేవంత్ చెప్పారు. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి -మిగతా 2 లో



### ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

- జూన్ 2న ఆదిలాబాద్ నుంచి రెండో విడత ప్రారంభం
- గూడులేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు
- జాయింట్ సర్వేతో భూ సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం

హైదరాబాద్,
పేద కుటుంబానికి సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది వారి ఆత్మ గౌరవానికి, భద్రమైన భవిష్యత్తుకు ప్రతీకని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిరంతరం కొనసాగించే ప్రక్రియగా చేపట్టిందన్నారు. గూడులేని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు సమకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇవ్వని విధంగా ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో (వంద శాతం సబ్సిడీతో) పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి తెలంగాణ ప్రభుత్వం దేశానికి తలమానికంగా నిలిచిందన్నారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా శుక్రవారం -మిగతా 2 లో




### ఆన్ లైన్ లోనే మహానాడు

- చంద్రబాబు సంచలన నిర్ణయం
- పొదుపు చర్యలు ప్రకటించిన ప్రధాని మోదీ
- నెల్లూరులో మహానాడు నిర్వహణకు ఇప్పటికే ముమ్మర ఏర్పాట్లు
- మోదీ పిలుపు నేపథ్యంలో చంద్రబాబు కీలక నిర్ణయం
- హైబ్రిడ్ విధానంలో రెండ్రోజుల పాటు టీడీపీ మహానాడు
- ఎన్టీఆర్ భవన్ లో స్టేజి ఏర్పాటు... రాష్ట్రవ్యాప్తంగా స్క్రీన్లపై ప్రసారం

అమరావతి:
టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు పొదుపు చర్యల్లో భాగంగా టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని ఈ ఏడాది కేవలం ఆన్ లైన్ లోనే జరపాలని నిర్ణయించారు. వాస్తవానికి ఈ నెల 27, 28, 29 తేదీల్లో నెల్లూరులో ఘనంగా మహానాడు నిర్వహించేందుకు ఏర్పాట్లు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి. -మిగతా 2 లో

## ముందుగానే నైరుతి రుతుపవనాలు



- ఏపీ, తెలంగాణకు వర్ష సూచన
- ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ముందుగానే
- మే 26న కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందంటున్న వాతావరణ శాఖ
- రుతుపవనాల ప్రభావంతో దక్షిణ భారతంలో ఉష్ణోగ్రతలు తగ్గి ఉక్కపోత తగ్గే అవకాశం
- ఏపీలో అల్పపీడనం ప్రభావంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం
- గంటకు 30--40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ
- తెలంగాణలోనూ కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

2 లో



### ఎన్నికలు కాగానే పెట్రోల్ ధరలు పెంచారు

- మోడీ వైఫల్యానికి ఇది నిదర్శనం
- మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శ


హైదరాబాద్,
ఎన్నికలు పూర్తి కాగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ ఊహించిన విధంగా పెట్రోల్ డీజిల్ పెంచకుండా ఆపారన్నారు. ఎన్నికలు పూర్తికాగానే ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం కూడా కాకముందే -మిగతా 2 లో



## రూపాయి విలవిల

- చరిత్రలో మొదటిసారిగా డాలర్‌తో మారకపు విలువ రూ. 96లకు దిగువన నమోదు
- ఈ సంవత్సరం 6 శాతం నష్టం
- వేగంగా రూపాయి క్షీణత
- 96-98 వరకు క్షీణించే అవకాశం
- భారీగా పెరుగుతున్న దిగుమతుల బిల్లు

న్యూఢిల్లీ:
అమెరికా డాలర్‌తో పోల్చితే రూపాయి మారకపు విలువ శుక్రవారం నాడు భారీగా పతనమైంది. చరిత్రలో మొదటిసారి డాలర్‌తో రూపాయి విలువ 96.14 రూపాయలకు క్షీణించింది. చివరికి 95.86 వద్ద కనిష్టస్థాయిలో ముగిసింది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు రూపాయి 6 శాతానికి పైగా పతనమైంది. ఇరాన్ యుద్ధ ప్రభావం పెరగడంతో ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. దీంతో గడిచిన ఆరు ట్రేడింగ్ సెషన్లలో రూపాయి అత్యంత వేగంగా 2 శాతం మేర క్షీణించింది. అమెరికాలో బలమైన రిటైల్ అమ్మకాలు, స్థిరమైన కార్మిక మార్కెట్ డేటా, ఫెడరల్ రిజర్వ్ భారీగా వడ్డీ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలను తగ్గించడంతో డాలర్ ఇండెక్స్ బలపడింది. -మిగతా 2 లో



### ఆత్మహత్యలు కావు.. వ్యవస్థలు చేసిన హత్యలు

- నీట్ విద్యార్థుల ఆత్మహత్యపై రాహుల్ ఆందోళన
- ప్రభుత్వం ఎప్పుడు కళ్లు తెరుస్తుందని ప్రశ్న

న్యూఢిల్లీ,
నీట్ పరీక్షల రద్దుతో ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థులవి వ్యవస్థలు చేసిన హత్యలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నీట్ పరీక్షలకు సంబంధించిన ఆత్మహత్య ఘటనలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల కుంభకోణాలు, అవినీతి కారణంగా విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు. లఖింపూర్ ఖేరీకి చెందిన 22 ఏళ్ల హృతిక్ మిశ్రా చివరిసారిగా 'నేను ఇకపై పోటీ పరీక్షలు రాయను' అని చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. మూడోసారి నీట్ పరీక్ష రాస్తున్న హృతిక్, పరీక్ష రద్దు కావడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య -మిగతా 2 లో

## కేసీఆర్.. ఓ రోబో!

### సీఎం అయిన తర్వాతే ఆయనలో మార్పు



- కేసీఆర్ కేవలం ఒక యంత్రంలా పనిచేశారు
- అందుకే ప్రజల భావోద్వేగాలు అర్థం కావు
- తనకే స్వేచ్ఛగా సమస్యలు చెప్పుకునే అవకాశం లేదు
- ఉద్యమ నాయకుడిగా ఆయన గొప్ప వ్యక్తి
- మరోసారి కేసీఆర్ పై కవిత కామెంట్స్

హైదరాబాద్,
ప్రస్తుతం కేసీఆర్ ను ఒక 'మరమనిషి' (రోబో)గా తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత అభివర్ణించారు. పరిపాలనా కాలంలో కేసీఆర్ కేవలం ఒక యంత్రంలా పనిచేశారని, అందుకే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదని విమర్శించారు. హైదరాబాద్ లో ఒక మీడియా సంస్థ శుక్రవారం నిర్వహించిన కాన్ క్లేవ్ లో మాట్లాడారు. ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ ఎప్పుడూ -మిగతా 2 లో

## పెట్రోల్,డీజిల్
# ధరల పెంపు

మొదటి తరువాయి

దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం గమనార్హం. కాగా.. ఈ ప్రకటనలకు ముందే ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందనే వార్తలు దేశంలోని వాహనదారులను ఆందోళనకు గురిచేశాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. సీఎన్‌జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్‌జీని రూ.2 చొప్పున పెంచాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ3.29, డీజిల్‌పై రూ.3.14, తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచాయి. పెట్రోల్ ధరలు: దిల్లీలో రూ.97.77, కోల్‌కతాలో 108.74, ముంబయిలో 106.68 , చెన్నైలో 103.67 (?2.83)గా ఉండనున్నాయి. ఇక డీజిల్ ధరలు: దిల్లీలో 90.67, కోల్‌కతాలో 95.13, ముంబయి 93.14, చెన్నైలో 95.25గా ఉండనున్నాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ఆయిలు కంపెనీలు నిర్ణయించాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14పై పెంచాయి. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచాయి.

# ఆన్ లైన్ లోనే మహానాడు

మొదటి తరువాయి

అయితే, ప్రధాని మోదీ పశ్చిమాసియా సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంధన పొదుపుపై జాతికి దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు పొదుపు చర్యలు పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పుడు మహానాడును ఆన్ లైన్ లో హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని ప్రకటించడం ద్వారా ఆ పొదుపు చర్యలను మరింత ముందుకు తీసుకెళ్లారు. ఆన్ లైన్ లో మహానాడును ఈ నెల 27, 29 తేదీల్లో నిర్వహించనున్నారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ లో ఒక వేదిక నిర్మించి దానిపై పొలిట్ బ్యూరో సభ్యులు ప్రసంగించనున్నారు. ఈ హైబ్రిడ్ మహానాడు కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,845 క్లస్టర్లలో ఎలక్ట్రానిక్ స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్టీఆర్ భవన్ నుంచి పొలిట్ బ్యూరో సభ్యులు పాల్గొనేలా ఏర్పాట్లు చేయనున్నారు.

# ఎన్నికలు కాగానే పెట్రోల్ ధరలు పెంచారు

మొదటి తరువాయి

దేశ ప్రజలకు ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు పెట్రోల్ ధరలు పెంచి మరోసారి అన్యాయం చేసిందని వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు అన్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిందని గుర్తు చేశారు.గతంలో యూపీఏ ప్రభుత్వం నయా పైసా పెంచక ముందే గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తుండే అని చెప్పారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్ పర్యటనలో పెట్రోల్, డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలి అన్నప్పుడే నడ్డివిరుస్తారని అనుమానం వచ్చిందన్నారు. ఆరు నెలల స్టాక్ ఉందని చెప్పారు. యుద్ధం కారణం చూపుతున్నారని.. యుద్ధం ఈరోజు రాలేదు.. ఇప్పటి నుండో ఉందన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలపై కాంగ్రెస్ పార్టీ అందరం కలిసి వ్యతిరేకిస్తున్నామని.. పెట్రోల్ ధరలపై బీజేపీ నేతలు స్పందించి ముక్కు నేలకు రాయాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# కేసీఆర్.. ఓ రోబో!

మొదటి తరువాయి

గొప్ప వ్యక్తి అని, ఆ పాత్రలో ఆయనతో ఎవరికీ ఎటువంటి సమస్యలు లేవని ప్రశంసించారు. అయితే, ఆయన ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాతే ప్రజలకు పూర్తిగా దూరమయ్యారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధినేతగా ఆయన ఎంత కఠినంగా ఉండేవారంటే, కన్నబిడ్డగా తనకే తన సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశం ఉండేది కాదని ఆమె పేర్కొన్నారు. సొంత కుటుంబ సభ్యులకే అందుబాటులో లేని వ్యక్తి, ఇక సామాన్య ప్రజల కష్టాలను ఎలా వింటారని ఆమె ప్రశ్నించారు. ఉద్యమ నాయకుడి నుంచి ఒక యంత్రంలాంటి ముఖ్యమంత్రిగా కేసీఆర్ మారిన తీరే ప్రస్తుత రాజకీయ పరిణామాలకు కారణమని కవిత పేర్కొన్నారు.

## ఆత్మహత్యలు కావు.. వ్యవస్థలు చేసిన హత్యలు

మొదటి తరువాయి

చేసుకున్నాడని పేర్కొన్నారు. అలాగే ఉనీజీలో కూడా నీట్ పరీక్ష రాసిన మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేశారు. ఈ ఘటనలు కేవలం ఆత్మహత్యలు కావని, అవినీతి వ్యవస్థ చేసిన హత్యలని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పరీక్ష చేతిలో విద్యార్థులు ఓడిపోలేదు.. అవినీతి వ్యవస్థ చేతిలో బలయ్యారని అన్నారు. 2015 నుంచి 2026 వరకు దేశవ్యాప్తంగా 148 పరీక్షల కుంభకోణాలు వెలుగుచూశాయని ఆయన ఆరోపించారు. వాటిలో 87 పరీక్షలు రద్దయ్యాయని, దాదాపు 9 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభావితమైందని పేర్కొన్నారు. ఈ 148 కుంభకోణాల్లో కేవలం ఒక్కరికే శిక్ష పడిందని, సీబీఐ 17 కేసులు, ఈడీ 11 కేసులు నమోదు చేసినప్పటికీ ఎవరూ బాధ్యత వహించలేదని విమర్శించారు. ప్రత్యేకంగా నీట్, ఏఐపీఎంటీ మరియు ఇతర వైద్య ప్రవేశ పరీక్షల్లోనే 15 కుంభకోణాలు జరిగాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారాల్లో బాధ్యులైన అధికారులు, మంత్రులు రాజీనామా చేయకపోవడం అత్యంత సిగ్గుచేటని అన్నారు. కొందరిని తొలగించినట్లు చూపించి, తిరిగి ఉన్నత పదవుల్లో నియమిస్తున్నారని ఆరోపించారు. మోసానికి సహకరించే వారికి బహుమతులు లభిస్తుండగా, పరీక్షలు రాసే పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు అంటూ కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని మోడీని ఉద్దేశించి, మీలో జవాబుదారీతనం మేల్కొనడానికి ఇంకా ఎంతమంది హృతిక్‌లు కావాలని ప్రశ్నించారు. విద్యార్థుల బాధ తన బాధ అని, వారి భవిష్యత్తును దోచుకున్న వారు తప్పకుండా సమాధానం చెప్పాల్సి ఉంటుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఎంత కాలం పట్టినా సరే, ఎవరినీ వదిలిపెట్టం. ఈ యుద్ధాన్ని మనం కలిసి పోరాడదాం.. మనం గెలుస్తాం అంటూ ధైర్యాన్ని ఇచ్చారు.

# రూపాయి విలవిల

మొదటి తరువాయి

దేశీయ ఈక్విటీ మార్కెట్లలోకి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు, ఎఫ్‌పీఐల ప్రవాహాలు తగ్గడంతో చెల్లింపుల బ్యాలెన్స్‌పై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఎఫ్‌పీఐలు దేశీయ మార్కెట్ల నుంచి 2 లక్షల కోట్లకు పైగా విలువైన ఈక్విటీలను విక్రయించారు. ప్రధానంగా చైనా, తైవాన్, దక్షిణ కొరియా మార్కెట్లకు ఈ పెట్టుబడులు తరలిపోతున్నాయి. ఈ కారణంగా కూడా రూపాయి మరింతగా బలహీనపడుతోంది. ముడి చమురు ధరలు పెరుగుతున్నందన ద్రవ్యోల్బణ ఆందోళనలు పెంచుతున్నాయి. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్‌లో రూపాయి ఇంట్రాడే ట్రేడింగ్‌లో 50 పైసలు పతనమై రికార్డు కనిష్టానికి 96.14 రూపాయలు పతనమైంది. చివరికి క్రితం రోజు ముగింపుతో పోల్చితే 22 పైసలు పతనమై 95.86 రూపాయల వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ చమురు ధర 100 డాలర్లకు పైగా కొనసాగితే రూపాయి మరింత పతనం అయ్యే అవకాశం ఉందని ఫారెక్స్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ముడి చమురు ధరల ప్రభావంతోనే భారత్ హోల్ సేల్ ద్రవ్యోల్బణం ఏప్రిల్ నెలకు 8.3 శాతంగా నమోదైంది. ముడి చమురు దిగుమతి చేసుకునే ప్రతి దేశంలోనూ ధరల పెరుగుదల ఎక్కువగానే ఉంటుందని వీరు చెబుతున్నారు. రూపాయి గమనం కూడా ముడి చమురు ధరలతో ముడిపడి ఉంది. బ్యారెల్ ముడి చమురు ధర 80-90 డాలర్ల మధ్య ఉంటే రూపాయికి భారీ ఉపశమనం లభిస్తుంది. చమురు ధర తగ్గితే దిగుమతుల బిల్లు తగ్గి, కరెంట్ అకౌంట్ ఒత్తిళ్లు తగ్గుతాయి. ఫలితంగా డిసెంబర్ నాటికి రూపాయి విలువ 93-94 మధ్య ఉండే అవకాశం ఉంది. ప్రతికూల అంచనాల ప్రకారం బ్యారెల్ చమురు ధర ప్రస్తుతం ఉన్నట్లుగానే 100 డాలర్ల వరకు ఉంటే రూపాయి మరింత ఒత్తిడికి గురవుతుంది. ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి డాలర్‌తో మారకపు విలువ 96-98 రూపాయలకు క్షీణించే అవకాశం ఉంది.

# నీట్ రీఎగ్జామ్..

**-అదే నెల 14 నుంచి విద్యార్థులకు అడ్మిట్ కార్డులు**
**-గతంలో ఎగ్జామ్ రాసిన వారికి ఫీజు రిటర్న్**
**-ఉచితంగానే రీ ఎగ్జామ్‌కు అందరికీ ఎంట్రీ**
**-వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లోనే పరీక్ష**
**-ఎంట్రన్స్ పరీక్షల్లో సమూల మార్పులు**
**-విద్యార్థులకు భరోసా ఇచ్చిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర**




**న్యూఢిల్లీ,**

దేశవ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ యూజీ పరీక్ష విధానంలో కేంద్ర ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. వచ్చే ఏడాది నుంచి ఈ పరీక్షను పూర్తిగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. జాతీయ ప్రవేశ పరీక్షల వ్యవస్థలో ఇది ఒక ప్రధాన సంస్కరణగా నిలవనుంది. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... పేపర్ లీకేజీ కారణంగా రద్దు చేసిన నీట్ యూజీ 2026 పరీక్షను తిరిగి జూన్ 21న నిర్వహించనున్నట్లు ధృవీకరించారు. దీనికి సంబంధించిన అడ్మిట్ కార్డులను జూన్ 14 నాటికి జారీ చేస్తామని తెలిపారు. మే 3న పరీక్ష నిర్వహించగా, మే 7న "గెస్ పేపర్" గురించి ఆందోళనలు వ్యక్తమయ్యాయని, కొద్ది రోజుల్లోనే పేపర్ లీక్ అయినట్లు అధికారులు నిర్ధారించారని ఆయన వివరించారు.

**విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడకూడదని..**

"లీకేజీ వాస్తవమని తేలిన వెంటనే, విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడకూడదని నిర్ణయించుకుని మే 12న పరీక్షను రద్దు చేశాం" అని ప్రధాన్ పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలను, అసాంఘిక శక్తులను ఏమాత్రం సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ పేపర్ లీకేజీ ఘటనపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ తో లోతైన విచారణ జరిపిస్తామని, దీని మూలాలను కనుగొనాలని ఏజెన్సీలను ఆదేశించినట్లు చెప్పారు. "కష్టపడి చదివే విద్యార్థులకు అన్యాయం జరగనివ్వం. విద్యార్థుల నమ్మకమే మాకు అత్యంత ముఖ్యం" అని ఆయన అన్నారు.

**ఇక.. 'జీరో-ఎర్రర్'**

గతంలో ఇలాంటి సంఘటనల నేపథ్యంలోనే రాధాకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఆ కమిటీ సిఫార్సులను అమలు చేసినప్పటికీ, పరీక్షల నిర్వహణలో లోపం జరిగిందని అంగీకరించారు. సుప్రీంకోర్టు సిఫార్సు మేరకు ఏర్పాటైన ఎన్టీఏలో నిరంతర సంస్కరణలు జరుగుతున్నాయని, 'జీరో-ఎర్రర్' పరీక్షల నిర్వహణకు వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రద్దయిన పరీక్షకు హాజరైన అభ్యర్థులకు వారి పరీక్ష ఫీజును తిరిగి వాపసు ఇస్తామని, త్వరలో నిర్వహించే రీఎగ్జామ్ ను ఉచితంగా నిర్వహిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం పరీక్షకు వారం రోజుల ముందు తమకు నచ్చిన పరీక్షా నగరాన్ని ఎంచుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వీలైనంత వరకు రవాణా సౌకర్యాలు కూడా ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు.

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రి

మొదటి తరువాయి

వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యుమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

మొదటి తరువాయి

నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు, హౌసింగ్ డిపార్ట్ మెంట్ అధికారులతో మంత్రిగారు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఖమ్మం ఇన్ ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రులు దాసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పార్లమెంటు సభ్యులు వేం నరేందర్ రెడ్డి, పి.బలరాం నాయక్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరును విజయవంతంగా పూర్తి చేసి లక్షలాది పేద కుటుంబాల సొంత ఇంటి కలలను నెరవేర్చామని తెలిపారు. 3 లక్షలకు పైగా ఇండ్లను మంజూరు చేయగా, దాదాపు 2.90 లక్షల వరకు గ్రౌండింగ్ కాగా, ఇందులో ఇప్పటికే సుమారు 50 వేల గృహ ప్రవేశాలు కూడా జరిగాయని, అలాగే మరో రెండు లక్షలకు పైగా ఇండ్ల నిర్మాణం పనులు వివిధ దశల్లో ఉన్నాయని మరో రెండు నెలల్లో పూర్తి అవుతాయని తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేయగా, ఐటీడీఏ ప్రాంతాల్లోని నియోజకవర్గాలకు అదనంగా ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. వచ్చే నెల రెండో తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఇది ఇంతటితో ఆగిపోదని అర్హులైన ప్రతి లబ్దిదారునికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే వరకు మూడవ, నాలుగవ విడతలుగా ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇరవై వేల వరకు ప్రభుత్వం నుంచి సహాయం పొందిన వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ పైలట్ గ్రామాల్లో ఆరువందలకు పైగా చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇండ్లను నిర్మించిన వారి బిల్లులను క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. పేదవాడు తాను నివశిస్తున్న పూరి గుడిసె స్థానంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటే, తమ ల్యాండ్ అంటూ ఫారెస్ట్ అధికారులు గానీ, సింగరేణి యాజమాన్యం కానీ అడ్డుపడొద్దని చెప్పారు. ఇండ్ల బేస్ మెంట్ కోసం చెరువులు, కుంటల నుంచి మట్టిని తరలిస్తే రెవెన్యూ పోలీసులు అడ్డు చెప్పకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి పేదల కోసం భూములను సేకరించి పట్టాలిచ్చారని, ఇందులో ఇంకా కొంత భూమి మిగిలే ఉందని దీనిని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, రెవెన్యూ విభాగానికి సంబంధించి క్షేత్ర స్థాయిలోని స్థితిగతులపై ప్రజాప్రతినిధుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడానికి, ఆయా నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించే చర్యలు తీసుకునే క్రమంలోనే సమావేశాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధుల సూచనలకు అనుగుణంగా వచ్చే నెలలో ప్రారంభం కానున్న ఇందిరమ్మ ఇండ్ల 2 విడత కార్యక్రమంలో అవసరమైన మార్పులు చేర్పులు చేస్తామన్నారు.

# ముందుగానే నైరుతి రుతుపవనాలు

**-ఏపీ, తెలంగాణకు వర్ష సూచన**
**-ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ముందుగానే**
**-మే 26న కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందంటున్న వాతావరణ శాఖ**
**-రుతుపవనాల ప్రభావంతో దక్షిణ భారతంలో ఉష్ణోగ్రతలు తగ్గి ఉక్కపోత తగ్గే అవకాశం**
**-ఏపీలో అల్పపీడనం ప్రభావంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం**
**-గంటకు 30--40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ**
**-తెలంగాణలోనూ కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం**



**అమరావతి:**

భానుడి భగభగలతో అల్లాడుతున్న ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణ సమయం కంటే ముందే దేశాన్ని తాకే అవకాశం ఉంది అని వాతావరణ శాఖ పేర్కొంది. మే 26వ తేదీనే కేరళ తీరాన్ని రుతుపవనాలు తాకే అవకాశం ఉందని ఐఎండీ అధికారికంగా ప్రకటించింది. అంటే జూన్ 1న రావాల్సిన రుతుపవనాలు ఈ ఏడాది ఆరు రోజుల ముందే రావడం గమనార్హం. రుతుపవనాల రాకతో దక్షిణ భారత రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు తగ్గి, ఉక్కపోత నుంచి జనాలకు పెద్ద ఎత్తున ఉపశమనం లభించనుంది. అంతేకాదు ఖరీఫ్ పంటలు వేసే రైతులకు కాస్త ఉపశమనం లభించనుంది. ఇకపోతే నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతుంది. దీని ప్రభావంతో శనివారం తెలంగాణతో పాటు ఏపీలో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

**ఏపీలో నేడు వర్షాలు**

నైరుతి బంగాళాఖాతం-పశ్చిమ మధ్య బంగాళాఖాతం సమీపంలో అల్పపీడనం కొనసాగుతోంది. రాగల 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ, యానాంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది అని తెలిపింది. సముద్ర మట్టానికి 5.8 కిలో మీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ అల్పపీడనం ప్రభావంతో శనివారం ఏపీలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

చచచ కొప్పెర్లపాడులో అత్యధికంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఇకపోతే ఆంధ్రప్రదేశ్‌లో శుక్రవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా ప్రకాశం జిల్లా కొప్పెర్లపాడులో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆ తర్వాత ఎన్టీఆర్ జిల్లా తోటగూడెపాడులో 42.7 డిగ్రీలు, పల్నాడు జిల్లా గండిగనుమలలో 42.6 డిగ్రీలు, కర్నూలు జిల్లా నగరిడోనలో 42.2 డిగ్రీలు, కృష్ణా జిల్లా ఉయ్యూరులో 42.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

**తెలంగాణలో 4 జిల్లాల్లో మోస్తరు వర్షాలు**

తెలంగాణ రాష్ట్రంలో శనివారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. అలాగే గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది అని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.

**17 జిల్లాల్లో 41 పైగా డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు**

ఇకపోతే శనివారం తెలంగాణలో పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సైతం భారీగా నమోదయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. బంగాళాఖాతంలో తీవ్రమైన అల్పపీడనం కొనసాగుతున్నప్పటికీ పలు జిల్లాల్లో 41 కి పైగా డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఆదిలాబాద్, జగిత్యాల, జోగులాంబ గద్వాల్, కామారెడ్డి, కరీంనగర్, కొమురంభీం, మహబూబ్ నగర్, మంచిర్యాల, మెదక్, నాగర్ కర్నూల్, నారాయణపేట్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, వికారాబాద్, వనపర్తి జిల్లాల్లో 41 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

## శాతవాహన విశ్వవిద్యాలయానికి మరో పేటెంట్ గౌరవం



**కరీంనగర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : శాతవాహన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శ్రీవాణికి యునైటెడ్ కింగ్‌డమ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆఫీస్ పేటెంట్ మంజూరు చేసింది. కృత్రిమ మేధస్సు ఆధారిత ఆర్థిక ప్రణాళిక దృశ్యీకరణ కంప్యూటర్ టెర్మినల్ అనే వినూత్న పరిశోధనకు ఈ గుర్తింపు లభించింది. ఈ టెర్మినల్ ద్వారా వ్యక్తిగత, వ్యాపార, సంస్థాగత ఆర్థిక ప్రణాళికలను కృత్రిమ మేధ సహాయంతో గ్రాఫ్‌లు, చార్టులు వంటి ఆధునిక దృశ్య రూపంలో విశ్లేషించుకోవచ్చు. ఈ సందర్భంగా ఉపకులపతి ఉమేశ్ కుమార్, రిజిస్ట్రార్ సతీష్ కుమార్ శ్రీవాణిని అభినందిస్తూ, అధ్యాపకులు నాణ్యమైన పరిశోధనలు చేసి మరిన్ని పేటెంట్లు సాధించాలని సూచించారు. డాక్టర్ శ్రీవాణి ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పరిశోధన పత్రాలు సమర్పించి, పుస్తకాలు ప్రచురించారు. ఆమె మార్గదర్శకత్వంలో నలుగురు విద్యార్థులు పిహెచ్‌డీ పూర్తి చేశారు. 2025లో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సహాయ ఆచార్యురాలిగా గుర్తింపు పొందారు. శ్రీవాణి సాధనతో శాతవాహన విశ్వవిద్యాలయం పరిశోధనలో మరో ముందడుగు వేసింది.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నగరంలో రూ.37 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్ శ్రీకారం చుట్టారు. 2వ డివిజన్‌లో రూ.17 లక్షలతో సీసీ రోడ్డు పనులు, 4వ డివిజన్‌లో కరెంట్ పోల్స్ మరియు లైటింగ్ పనులు ప్రారంభమయ్యాయి. 13, 44వ డివిజన్లలో రూ.20 లక్షల మున్సిపల్ నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రతి డివిజన్‌లో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో త్వరలోనే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు భూపతి రవీందర్, చడగొండ కవిత బుచ్చిరెడ్డి, తెల్ల లక్ష్మి రమేష్, మునీందర్, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. నగర అభివృద్ధి కోసం మౌలిక సదుపాయాల పనులు వేగంగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## ఉపాధి హామీ కూలీల వేతనాలు విడుదల చేయాలని డిమాండ్

**మానకొండూర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాయకంటి శ్రీనివాస్ కోరారు. మద్దికుంట, కొండపలకల, గంగిపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, కూలీలకు వారం వారం వేతనాలు ఇవ్వాలని చట్టం ఉన్నప్పటికీ నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో పెట్టడం అన్యాయం అని అన్నారు. రెండుసార్లు ఫోటోలు తీసే విధానం, మొబైల్ మానిటరింగ్ సిస్టం, ఆధార్ లింకులు వంటి విధానాలు కూలీలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని విమర్శించారు. పేదల పొట్ట కొట్టే విబిజీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి, పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, పట్టణ పేదలకు కూడా ఉపాధి కల్పించాలని, పని దినాలను 150 రోజులకు పెంచి రోజువారీ కూలి రూ.400 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కూలీలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని రాయకంటి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## రక్తదానంలో నాగర్‌కర్నూల్ యువత ఆదర్శం



**నాగర్‌కర్నూల్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌కు యువత 15 యూనిట్ల రక్తాన్ని అందించి ఆదర్శంగా నిలిచారు. నర్సింగ్ అధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి. ఉషారాణి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, "వేసవికాలంలో రక్తహీనత, గర్భిణులు, డెలివరీలు, ఆపరేషన్లకు అధిక రక్తం అవసరం. రక్తదానం చేసిన వారి రక్తం 90 రోజుల్లో పునరుత్పత్తి అవుతుంది. ప్రజలు, యువత ప్రతిరోజూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి" అని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఏ. రోహిత్ కుమార్, నర్సింగ్ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు, హెల్త్ డెస్క్ ఇంచార్జ్ టి. యాదగిరి, యువత పాల్గొన్నారు.

## ధాన్యం లారీ బోల్తా - డ్రైవర్ కు తీవ్ర గాయాలు



**పాలకుర్తి, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పుట్నూరు గ్రామ శివారులో శుక్రవారం ఉదయం వడ్లతో వెళ్తున్న లారీ రోడ్డుపై ఉన్న భారీ గుంతలో పడిపోవడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బసంతనగర్‌కు చెందిన డ్రైవర్ గండికోట రాజేందర్ తీవ్రంగా గాయపడ్డాడు. ధర్మారం ఎక్స్‌రోడ్ నుండి పుట్నూరు వరకు జయ్యారం క్వారీల నుండి బోల్డర్ లారీల రాకపోకలతో రోడ్డు గుంతలమయమై ప్రమాదకరంగా మారిందని గ్రామస్థులు వాపోతున్నారు. గత నెలలో లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినా అధికారులు స్పందించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున ఇప్పటికైనా అధికారులు రోడ్డు మరమ్మత్తులు చేసి డ్రైవర్ల ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు పరిస్థితులు అధ్వాన్నంగా మారడంతో లారీ డ్రైవర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**కరీంనగర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సందర్శించారు. రైతులు గత 15 రోజులుగా మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు దొంగల బెడద ఉందని వారు వాపోయారు. ఈ పరిస్థితిపై కమలాకర్ మార్కెట్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున వెంటనే మక్కలను కాంటా పెట్టి సరిపడా లారీలు ఏర్పాటు చేసి గోదాంలకు తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల శ్యాం సుందర్ రెడ్డి, పొన్నం అనిల్, ఏనుగు రవీందర్ రెడ్డి, తిరుపతి నాయక్, సుంకి శాల సంపత్ రావు, గోనె నర్సయ్య, మంద రాజమల్లు, అరే శ్రీకాంత్, పబ్బతి రంగారెడ్డి, జువ్వాడి రాజేశ్వర్ రావు, రైతులు పాల్గొన్నారు. రైతుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కమలాకర్ స్పష్టం చేశారు.

## ఇంధన ధరల పెంపుపై గుంజపడుగు హరిప్రసాద్ ఆగ్రహం



**కరీంనగర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : పెట్రోల్, డీజిల్ ధరలను నిరంతరం పెంచుతూ ప్రజలపై భారాన్ని మోపుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. ప్రధానమంత్రి ప్రజలకు పొదుపు సూత్రాలు చెప్పి తాను మాత్రం హంగు ఆర్భాటాలతో విదేశీ పర్యటనలకు వెళ్లడం, అదే సమయంలో ఇంధన ధరలను పెంచడం ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన విమర్శించారు. ఇంధన ధరల పెంపు వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు, రవాణా రంగం, వ్యాపారులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచడం ప్రజలను మోసగించడం అని ఆయన అన్నారు. ప్రజలపై భారాన్ని తగ్గించేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని హరిప్రసాద్ డిమాండ్ చేశారు.

## ఇంధన ధరల పెంపుపై బీఆర్ఎస్ ఆగ్రహం

**హుస్నాబాద్, మే 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**




పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరలను పెంచి ప్రజలపై అధిక భారం మోపిందని విమర్శించారు. ఇప్పటికే ధరలు ఎక్కువగా ఉండగా మరోసారి పెంపు చేయడం పేద, మధ్యతరగతి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని అన్నారు. వ్యవసాయ కోతల సీజన్‌లో రైతులపై అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచడం ప్రజా వ్యతిరేక విధానమని ఆరోపించారు. కేంద్రం ఇప్పటికైనా ఆలోచించి పెంచిన ధరలను తగ్గించాలని, లేకుంటే ప్రజలు తగిన తీర్పు ఇస్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సూరం పర్శరాములు, యాస శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లమల్లలో కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పర్యటన



**అమ్రాబాద్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శుక్రవారం అమ్రాబాద్ టైగర్ రిజర్వులోని చెంచు పెంటలను సందర్శించారు. చెంచు గిరిజనుల జీవనోపాధి, విద్య, వైద్యం, తాగునీరు, రహదారి, రేషన్, ఇళ్ల స్థలాలు, ఉపాధి అవకాశాలపై వారి సమస్యలను నేరుగా విని వివరాలు సేకరించారు. ప్రభుత్వం చెంచుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యతగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి మౌలిక వసతులు కల్పించాలని, పెన్షన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిల్లలందరినీ తప్పనిసరిగా బడికి పంపాలని, అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని సూచించారు. చెంచుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డిఓ, అమ్రాబాద్ ఎంపీడీవో లింగయ్య, ఎమ్మార్వో వెంకటేశ్వర రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ కృష్ణ, మన్ననూరు సర్పంచ్ మంజుల రాజారాం, పంచాయతీ కార్యదర్శి బీముడు తదితరులు పాల్గొన్నారు. చెంచు గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.

## శనిగరంలో సీసీ కెమెరాలను ప్రారంభించిన అదనపు డీసీపీ




**హుస్నాబాద్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కోహెడ మండల శనిగరం గ్రామంలో సిద్దిపేట సురక్ష నేత్ర కార్యక్రమం భాగంగా ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలను అదనపు డీసీపీ కుషాల్కర్ ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, బస్‌స్టేషన్, ఎంట్రీ--ఎగ్జిట్ పాయింట్ల వద్ద ఏర్పాటు చేసిన కెమెరాలు నేర నియంత్రణకు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికట్టడంలో ఇవి కీలకమని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే డయల్ 100 లేదా షీటీమ్‌ను సంప్రదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీను, కోహెడ ఎస్సై అభిలాష్, గ్రామ సర్పంచ్ లింగంపల్లి లక్ష్మయ్య, ఉపసర్పంచ్ పెరుక బుచ్చయ్య, వార్డు సభ్యులు, మహిళలు, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.
గ్రామ భద్రతలో సీసీ కెమెరాలు కీలకమని అదనపు డీసీపీ స్పష్టం చేశారు.

## మానసిక వికలాంగురాలు కనబడుటలేదు



**కరీంనగర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కిసాన్ నగర్‌కు చెందిన బైరం మమత (30) మే 14 రాత్రి నుండి కనిపించకుండా పోయింది. మాట స్పష్టంగా రాని ఆమె ఎరుపు రంగు పంజాబీ డ్రెస్ ధరించి ఇంటి నుండి వెళ్లిపోయింది. బంధువులు, పరిచయస్తుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె అన్న ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆమెను ఎవరికైనా కనిపిస్తే వెంటనే కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లేదా క్రింది నంబర్లలో సంప్రదించవచ్చు: 8106919168, 9908833022, 8712670763 మమత ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## అఖిల భారత పోలీస్ క్రీడల్లో హుజూరాబాద్ ఏసీపీ మాధవి ప్రతిభ



**కరీంనగర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన అఖిల భారత పోలీస్ క్రీడా పోటీల్లో హుజూరాబాద్ ఏసీపీ మాధవి అద్భుత ప్రతిభ కనబరిచి నాలుగు పతకాలు సాధించారు. టేబుల్ టెన్నిస్ విభాగంలో మిక్స్‌డ్ డబుల్స్‌లో ఒక రజత, రెండు కాంస్య పతకాలు, బ్యాడ్మింటన్ విభాగంలో మిక్స్‌డ్ డబుల్స్‌లో ఒక కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా గట్టి పోటీని తట్టుకొని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు కీర్తి తెచ్చారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సహా అధికారులు ఆమెను అభినందించారు. విధుల్లో బిజీగా ఉన్నప్పటికీ క్రీడల పట్ల మక్కువతో కఠోర శ్రమ చేసి జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
ఒకే పోటీలో నాలుగు పతకాలు సాధించి మాధవి పోలీస్ శాఖకు గౌరవం తెచ్చారు.

## గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు మూడో కన్నుగా పనిచేస్తాయి

--ఏసీపీ ఎస్. సదానందం



**హుస్నాబాద్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామంలో భద్రతా చర్యల భాగంగా నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బంక లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ ఎస్. సదానందం ప్రారంభించారు. గ్రామంలోని నాలుగు దిక్కుల్లో కెమెరాలు అమర్చడంతో నేటి నుంచి తోటపల్లి గ్రామం నిఘానేత్రంలోకి ప్రవేశించిందని సర్పంచ్ తెలిపారు. గ్రామ భద్రతలో సీసీ కెమెరాలు కీలకమని ఎస్సై లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఏసీపీ సదానందం మాట్లాడుతూ సీసీ ఫుటేజీలు నేర పరిశోధనల్లో కీలక ఆధారాలుగా ఉపయోగపడుతున్నాయని, యువత డ్రగ్స్, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి మహేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు మూడో కన్నుగా పనిచేస్తాయని అధికారులు స్పష్టం చేశారు.

## వరి ధాన్యం కొనుగోలు మిల్లులను తనిఖీ చేసిన కలెక్టర్ కె. హైమావతి



**సిద్ధిపేట, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో విద్యాభివృద్ధి, రైతు సంక్షేమం దిశగా కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం రెండు కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ కింద ఎస్టీ విద్యార్థుల ఎంపికకు లక్కీ డ్రా నిర్వహించారు. 3వ తరగతిలో దరఖాస్తు చేసిన ముగ్గురికి నేరుగా ప్రవేశం కల్పించగా, 5వ తరగతిలో ఐదుగురిలో ముగ్గురిని ఎంపిక చేసి ఒకరిని రిజర్వ్‌లో ఉంచారు. ఎంపికైన విద్యార్థులు తడకపల్లి శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో ప్రవేశం పొందనున్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి రాణించాలని కలెక్టర్ సూచించారు. తరువాత జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు మిల్లులను తనిఖీ చేసిన కలెక్టర్, దిగుమతిలో జాప్యం లేకుండా షిఫ్ట్‌ల వారీగా ఎక్కువ మంది హమాలీలతో పనులు నిర్వహించాలని మిల్లర్లను ఆదేశించారు. ధాన్యం మిల్లులకు చేరిన వెంటనే దిగుమతి పూర్తి చేసి, అక్నాలెడ్జ్‌మెంట్ ట్రక్ షీట్ జనరేషన్, ఓపీఎంఎస్ అప్‌లోడ్ ప్రక్రియలో ఆలస్యం చేయొద్దని స్పష్టం చేశారు. రైతులు వచ్చే ఖరీఫ్‌లో సన్న వడ్లు పండించి స్థానిక అవసరాలకు సరిపడా నాణ్యమైన బియ్యం ఉత్పత్తి చేయాలని సూచించారు. జిల్లాలో విద్యార్థుల భవిష్యత్‌కి, రైతుల ప్రయోజనాలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ పారదర్శక పాలన అందించడమే లక్ష్యమని కలెక్టర్ కార్యాచరణ ద్వారా స్పష్టమైంది. ఈ కార్యక్రమాల్లో ఏఓ రాజ్‌కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, సివిల్ సప్లై అధికారి తనూజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు పట్టాభిషేకం

**కరీంనగర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మే 19న కరీంనగర్‌లో ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమం జరగనుంది. ఉమ్మడి జిల్లాలో పదవ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించనున్నారు. దాదాపు 250 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొననున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ఫలితాలు సాధించడం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు.

# ఘనంగా గ్రంథాలయ దినోత్సవం వేడుకలు

**కరీంనగర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: హైదరాబాద్ స్థాయిలోనే కరీంనగర్ జిల్లాలో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థను కేంద్రంగా చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు అవసరమైన ప్రత్యేక శిక్షణ అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవో మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగ శిక్షణ కోసం యువత హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితిని తగ్గించేలా జిల్లాలోనే ఉన్నత స్థాయి శిక్షణ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలతో సమన్వయం



చేసుకుని ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధులతో రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా గ్రంథాలయ నూతన భవనం త్వరలో ప్రారంభమవుతుందని తెలిపారు. సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి గ్రంథాలయాలు జ్ఞానం, విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసానికి కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. చైర్మన్ సత్తు మల్లేష్ చదువు మనిషి జీవితాన్ని మార్చగల శక్తి అని, గ్రంథాలయం నాలెడ్జ్ హబ్‌గా పనిచేస్తోందని పేర్కొన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పుస్తక పఠనం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని సూచించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన, విద్యార్థుల కోసం పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ అందించిన ఎనిమిది కూలర్లను ప్రారంభించారు. గ్రంథాలయ దినోత్సవం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలి

- రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



**మర్రిగూడ, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కంపసాగర్ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో మర్రిగూడలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, "పంటల దిగుబడిని పెంచడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలి. యూరియా, పురుగుమందులు, రసాయనాలను తక్కువ మోతాదులో మాత్రమే వినియోగించాలి. పంటల మార్పిడి విధానాన్ని తప్పనిసరిగా పాటించాలి" అని సూచించారు. రైతులు అవసరానికి తగ్గట్టుగా మాత్రమే ఎరువులు వాడాలని, రసాయనాల వినియోగాన్ని తగ్గించాలని, సాగునీటిని వృథా చేయకుండా సంరక్షించాలని శాస్త్రవేత్తలు సూచించారు. సేంద్రియ పద్ధతులను పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి చేయవచ్చని వివరించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే మెలకువలను రైతులకు తెలియజేస్తూ, "నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడటం ప్రతి రైతు బాధ్యత" అని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. శివప్రసాద్, డాక్టర్ కె. సంధ్యారాణి, ఏవో సాహస్ విజయ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

## కోళ్ల ఫారం నిర్మాణంపై ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి గ్రామస్తుల ఫిర్యాదు



**మర్రిగూడ, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దామర భీమనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కోళ్ల ఫారం పై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కోళ్ల ఫారం వల్ల గ్రామంలో ఈగల బెడద పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వారు తెలిపారు. ఈ సమస్యపై గ్రామస్తులు మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఫిర్యాదు చేసి, తక్షణమే స్పందించి నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్నాటి వెంకటేశం, అచ్చిని సైదులు, జిల్లా అశోక్, రాహుల్ రెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ముందస్తు అరెస్ట్



**ఎలిగేడు, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఎలిగేడు మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. "అరెస్టులతో ఉద్యమకారుల గొంతు నొక్కాలని ప్రభుత్వం చూస్తే ఊరుకోము. వెంటనే డిమాండ్లు నెరవేర్చాలి, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం" అని నాయకులు హెచ్చరించారు. అరెస్టయిన వారిలో బింగి రాజు, సందనవేని నరేశ్, మారం మల్లేశం, బంగ్లా శ్రీనివాస్, కట్ల ప్రతాప్ తదితరులు ఉన్నారు.

## టీపీసీసీ ఎస్సీ సెల్ కో-ఆర్డినేటర్‌గా ఆరెపల్లి రాజేందర్ నియామకం



**కరీంనగర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మానకొండూర్‌కు చెందిన ఆరెపల్లి రాజేందర్‌ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా నియమించారు. ఈ మేరకు ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో కొత్తగా నియమితులైన మండల కాంగ్రెస్ అధ్యక్షులు సత్యనారాయణను కలసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆరెపల్లి రాజేందర్ గతంలో రామగుండం ఎన్టీపీసీలో డెప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేసి 2018లో స్వచ్ఛంధ పదవీ విరమణ చేశారు. విద్యావేత్తగా, దళిత ఉద్యమంలో, తెలంగాణ మలి దశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఆయన సామాజిక న్యాయం, దళిత ఐక్యత కోసం కృషి చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని, సమాజానికి ఉపయోగపడే విధంగా పనిచేస్తానని రాజేందర్ స్పష్టం చేశారు. రాజేందర్ నియామకంతో పార్టీ కార్యకలాపాలకు మరింత ఉత్సాహం చేకూరనుందని నేతలు అభిప్రాయపడ్డారు.

## నీట్ పేపర్ దోషులను కఠినంగా శిక్షించాలి

-- ఐఎన్టీయూసీ మహబూబ్ అలీ




**అచ్చంపేట, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నీట్ పేపర్ లీక్ వ్యవహారం విద్యార్థుల జీవితాలతో చెలగాటమని ఐఎన్టీయూసీ తాలూకా అధ్యక్షుడు మహబూబ్ అలీ తీవ్రంగా విమర్శించారు. "తల్లిదండ్రులు, విద్యార్థులు ఎన్నో కష్టాలు పడుతుంటే పేపర్ లీక్ అవడం భవిష్యత్తుపై దెబ్బ" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడి రాజీనామా చేయాలని, సిబిఐ విచారణ జరిపి దోషులను కనీసం 20 సంవత్సరాల యావజ్జీవ శిక్ష విధించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు గౌస్ పాషా, మండల అధ్యక్షుడు మౌలానా ఉస్మాన్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్పీ జిల్లా ఉపాధ్యక్షుడుగా నేనావత్ నరేష్ నియామకం



**మాడుగుల, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కుబ్య తండాకు చెందిన నేనావత్ నరేష్ తండ్రి పెంట్యను తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా, కల్వకుర్తి ఇన్‌చార్జ్‌గా నియమించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు.

## నేల వాలిన బీర తోట - రైతు ఆవేదన


నేలవారిన బీర తోట


నేలవారిన బీర తోట చూపుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు కొత్తిరెడ్డి బాపురెడ్డి

**ఎలిగేడు, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నారాయణపల్లి గ్రామానికి చెందిన రైతు కొత్తిరెడ్డి బాపురెడ్డి సాగు చేసిన బీర తోట ఇటీవల వీచిన భారీ గాలులకు నేలవాలింది. 15 గుంటల స్థలంలో కర్రలతో మల్చింగ్ విధానం, డ్రిప్ సిస్టమ్‌తో సాగు చేసిన తోటలో రూ.50 వేల పెట్టుబడి పెట్టినట్లు ఆయన తెలిపారు.బీర కాయలు కాస్తున్న సమయంలో గాలులకు పూర్తిగా నేలమట్టమవడంతో దాదాపు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి" అని బాధిత రైతు కోరారు.

## చెంచుల అభివృద్ధికి టీజీఐఎల్పీ

**- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**



**నాగర్‌కర్నూల్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చెంచు గిరిజన కుటుంబాలను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లేందుకు టీజీఐఎల్పీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.మల్లాపూర్ పెంట గ్రామంలో 34 చెంచు కుటుంబాలతో సమావేశమై వారి జీవన విధానం, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య పరిస్థితులు, పిల్లల విద్య, తాగునీటి సౌకర్యాలు వంటి అంశాలను కలెక్టర్ సమీక్షించారు."ప్రభుత్వ లక్ష్యం కేవలం సాయం అందించడం కాదు, ప్రతి కుటుంబం గౌరవప్రదమైన జీవితం గడపగలిగే స్థాయికి తీసుకెళ్లడమే" అని కలెక్టర్ స్పష్టం చేశారు. పశుపోషణ, కోళ్ల పెంపకం, చిన్న వ్యాపారాలు, అటవీ ఉత్పత్తుల ఆధారిత ఉపాధి, మహిళా సంఘాల ద్వారా పొదుపు అలవాట్లు, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు కల్పించాలని సూచించారు.గ్రామంలో తాగునీరు, విద్యుత్, రహదారులు, ఆరోగ్య సేవలు, విద్యా సౌకర్యాల అభివృద్ధిపై సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో పిడి చిన్న ఓబులేష్, ఆర్డీవో యాదగిరి, గిరిజన సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## సూదిని రాంరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



**ఆమనగల్లు, మే 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** గ్రామపంచాయతీ ట్రిబ్యునల్ చైర్మన్ గా సూదిని రాంరెడ్డి ఇటీవలే నియమితులయ్యారు. ఈమేరకు హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ఆమనగల్లు మండల మాజీ వైస్ ఎంపీపీలు జక్కు అనంతరెడ్డి, నిట్ట నారాయణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూలబొకే అందజేశారు. వారి వెంట మేడిగడ్డ తాండ ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్, నాయకులు జగన్ గౌడ్, రమేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఆర్థిక సహాయం అందించిన వస్పుల జంగయ్య



**అమనగల్లు, మే 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు నవ చైతన్య కాలనీకి చెందిన నల్లా జంగయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న హైదరాబాద్ టెలికం బోర్డ్ సభ్యుడు వస్పుల జంగయ్య మృతుడి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. అధైర్య పడొద్దు అండగా ఉంటానని భరోసానిచ్చారు. తనవంతు సహాయంగా రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసోజు రాములుచారి, దొక్క పురుషోత్తం, జంతుక రాములు, రామచంద్రయ్య, పులికంటి మహేష్, ఒగ్గు జంగయ్య ఉన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ సమస్యలపై వినతి పత్రం



**బోడుప్పల్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బోడుప్పల్ రాజీవ్ నగర్ కాలనీ డబుల్ బెడ్ రూమ్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ శ్యాంసుందరరావును కలిశారు.వారు సమర్పించిన వినతి పత్రంలో, కాలనీలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన 1,49,000 జలమండలి బిల్లును మాఫీ చేయాలని లేదా మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా చెల్లించేలా చూడాలని కోరారు. అదేవిధంగా మెట్లదారిలో నిర్మాణం ఆగిపోయిన రైలింగ్ పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.అసిస్టెంట్ కమిషనర్ శ్యాంసుందరరావు సానుకూలంగా స్పందిస్తూ, "మీ సమస్యల పరిష్కారం కోసం డిప్యూటీ కమిషనర్ శైలజతో మాట్లాడి జలమండలి బిల్లు, రైలింగ్ పనులు త్వరగా అమలు అయ్యేలా చూస్తాం" అని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు చిప్పల శ్రీధర్, ముఖ్య సలహాదారులు రాజగోపాల్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పంట మార్పిడితో అధిక దిగుబడి



**ఆమనగల్లు, మే 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రైతులు పంట మార్పిడితో పాటు రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడటం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంజయ్య, కనకదుర్గ లు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని రాంనుంతల గ్రామంలోని రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం వారి నిర్వహణలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖరీఫ్ కాలానికి అనుగుణంగా అధిక దిగుబడిని ఇచ్చే వరి పంటను ఎంపిక చేసుకోవాలని, పచ్చిరొట్టె ఎరువుల ద్వారా నేల సారాన్ని పెంపొందించవచ్చన్నారు. రసాయనిక ఎరువులను అధికంగా వాడటం వల్ల పర్యావరణానికి, నేల ఆరోగ్యానికి కలిగే నష్టాలను, పురుగుల మందులు అధికంగా వాడటం వల్ల వానపాములు నశించే అవకాశం ఉందన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా నీటిని పొదుపుగా వాడుకోవడంతో భవిష్యత్ తరాల వారికి నీటి వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా అమలవుతున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి వాటిని పొందె విధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో రాంనుంతల సర్పంచ్ శ్రీను నాయక్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్, విస్తరణ అధికారి మీనాక్షి మరియు అభ్యుదయ రైతులు, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

## మత సామరస్యంతో బక్రీద్ జరుపుకోండి.

**ఆమనగల్లు, మే 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** బక్రీద్ పండుగను మండలంలో మత సామరస్యాన్ని చాటుతూ ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్. హెచ్.ఓ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. పండుగ పూట ఎలాంటి అల్లర్లు, గొడవలకు తావులేకుండా సోదరభావంతో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఈ పండుగ సందర్భంలో అక్రమ పశువుల రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల పరిధిలో చెక్ పోస్టుల వద్ద నిఘా ఉంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.




## గ్రంథాలయం విజ్ఞానానికి నిలయం

**- ప్రిన్సిపాల్ డా. డి. వరలక్ష్మి**



**కరీంనగర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా పాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ & పీజీ కళాశాలలో మనం -- సమాజం అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినుల్లో సామాజిక బాధ్యత, పఠనాసక్తి, నాయకత్వ లక్షణాలు, సేవాభావం పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. గ్రంథాలయం విజ్ఞానానికి నిలయమని, పుస్తక పఠనం ద్వారా సమాజంపై అవగాహన పెంపొందించుకోవచ్చని వక్తలు పేర్కొన్నారు.ప్రిన్సిపాల్ డా. డి. వరలక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయ వినియోగం విద్యార్థుల్లో జ్ఞాన విస్తరణతో పాటు ఆత్మవిశ్వాసం పెంచుతుందని, సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. గ్రంథపాలకుడు హఫీజ్ మియా విద్యార్థులు పుస్తక పఠనాన్ని రోజువారీ అలవాటుగా మార్చుకోవాలని, పోటీ పరీక్షలు, ఉన్నత విద్య కోసం గ్రంథాలయ వనరులను వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పి. సరూప, అఫ్సర్నినీసా, డాక్టర్ నజియా, డాక్టర్ ఈ. స్రవంతి, స్వప్న, శ్రీరామ రెడ్డి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.సామాజిక చైతన్యంతో విద్యార్థులు దేశాభివృద్ధికి తోడ్పడాలని వక్తలు పిలుపునిచ్చారు.

## అంగన్వాడీల్లో మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేయాలి

**అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**




**కరీంనగర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ, టాయిలెట్, కాంపౌండ్ వాల్ వంటి పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. నేరేగా పథకం క్రింద నిర్మాణాలు పూర్తి చేసి ఈ నెల 29న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ప్రారంభించాలని, వచ్చే నెల నుండి పూర్వ ప్రాథమిక విద్య సమగ్రంగా అందించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.బరువు తక్కువగా ఉన్న శిశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైతే ఎన్ఆర్సి సెంటర్లకు రిఫర్ చేయాలని ఆదేశించారు. బాల్య వివాహాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టి, బాల్య వివాహాలు లేని మండలాలుగా ప్రకటించేందుకు కృషి చేయాలని సూచించారు.ప్రతి కార్యాలయంలో లైంగిక వేధింపుల నివారణ కమిటీలను బలోపేతం చేయాలని, సఖి కేంద్ర సేవలను విస్తృతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సిడిపివోలు సబిత, సుగుణ, నర్సింగరాణి, శ్రీలత, డీసీపీవో పర్వీన్, సఖి సెంటర్ అడ్మిన్ లక్ష్మి, డి హెచ్ ఈ డబ్ల్యూ కోఆర్డినేటర్ శ్రీలత, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సంపత్, సూపర్వైజర్లు పాల్గొన్నారు. అంగన్వాడీల్లో విద్యా, ఆరోగ్య సదుపాయాలను సమగ్రంగా అందించడమే లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

## నాటు సారావిడి గౌరవంగా బతకండి





**నందికొట్కూరు, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాటుసారా తయారీ, విక్రయాల వంటి చట్టవిరుద్ధ పనులను పూర్తిగా మానుకుని సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడపాలని అధికారులు నీలిశికారి కాలనీ ప్రజలకు సూచించారు.జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులు కాలనీ ప్రజలతో సమావేశమై పునరావాసం, ఉపాధి, ఇళ్ల సౌకర్యం కల్పనపై హామీ ఇచ్చారు. "విద్యతోనే ఉన్నత గౌరవం. పిల్లలను చదివించండి, భవిష్యత్తు మార్చుకోండి" అని అధికారులు స్పష్టం చేశారు.ఇల్లు లేని వారికి గృహ సౌకర్యం, స్వయం సహాయక సంఘాల రుణాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, ఆరోగ్య భద్రత, గృహ నిర్మాణం వంటి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ఈ సమావేశంలో రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, మున్సిపల్ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి పాపిశెట్టి రాము చేయూత




**ఆమనగల్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ మున్సిపాలిటీ ఐదవ వార్డు వర్కర్ వస్పుల జంగయ్య ఆకస్మిక మరణం స్థానిక ప్రజలను తీవ్రంగా కలచివేసింది. ఈ విషయం తెలిసిన వెంటనే మున్సిపాలిటీ కౌన్సిలర్ పాపిశెట్టి రాము బాధిత కుటుంబాన్ని పరామర్శించి తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. "మీ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం" అని భరోసా కల్పించారు. జంగయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులు ధైర్యంగా నిలవాలని ఆయన మనస్ఫూర్తిగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జంతుక కిరణ్, చలిచీమల సతీష్, శేఖర్, రాములు, ఈదయ్య, శివ, శ్రీరామ్, భరత్, కార్తిక్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

# సర్కిల్ 70లో ముమ్మరంగా కొనసాగుతున్న జనగణన




**కరీంనగర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సర్కిల్ నెంబర్ 70 ప్రాంతంలో జనగణన కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. తిరుమల నగర్, రాంపూర్, హనుమాన్ నగర్, స్టేడియం పరిసరాల్లో ఆరుగురు ఎన్యుమరేటర్లు మూడు రోజుల క్రితం ప్రారంభించిన గణనలో ప్రతి భవనాన్ని పరిశీలించి కుటుంబాలను గుర్తించారు. సూపర్వైజర్ కె. సుధాకర్ ఆధ్వర్యంలో ఎన్యుమరేటర్లు 14వ తేదీ నుండి కుటుంబాల వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. అనంతరం పర్యవేక్షకులు డేటాను సింక్ చేస్తున్నారు. సర్కిల్ 70లో గణన ప్రక్రియ వేగంగా కొనసాగుతున్నదని అధికారులు తెలిపారు.

# బక్రీద్ పండుగను పురస్కరించుకొని పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు



**కరీంనగర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** బక్రీద్ పండుగను పురస్కరించుకొని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, అక్రమ రవాణా నివారణ కోసం ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కమిషనర్ గౌస్ ఆలం తెలిపిన ప్రకారం, చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా కొనసాగిస్తూ సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు, భద్రతా పరికరాలు అందిస్తున్నారు. మొగ్దుంపూర్ చెక్‌పోస్టును స్వయంగా పరిశీలించిన కమిషనర్, లైట్ రిఫ్లెక్టర్ జాకెట్లు, సరిపడా లైటింగ్ వసతి మినహా కొన్ని రక్షణ పరికరాల కొరతను గుర్తించారు. శనివారం నుండి ప్రతి చెక్‌పోస్టులో టార్చ్‌లైట్లు, ఎల్ఈడీ బ్యాట్లు, విజిల్స్, సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. వాహనాల కదలికలు, అనుమానాస్పద వ్యక్తుల వివరాలు రికార్డు చేయాలని, సిబ్బంది రాత్రివేళల్లో రిఫ్లెక్టర్ జాకెట్లు ధరించాలని సూచించారు. పండుగ వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, చట్టవిరుద్ధ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకే ఈ తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజలు పోలీసులకు సహకరించి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన కోరారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

# తండ్రిని నరికి చంపిన తనయుడు



**కరీంనగర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ నగరంలోని కాశ్మీర్‌గడ్డలో కుటుంబ కలహాలు విషాదానికి దారితీశాయి. మద్యం మత్తులో తలెత్తిన గొడవలో కుమారుడు నరసయ్య తన తండ్రి ఆరెల్లి మల్లేష్‌పై గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు. తల్లిపై దాడి చేయడం చూసి అడ్డువచ్చిన తండ్రిపై నరసయ్య విచక్షణారహితంగా దాడి చేయడంతో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్న కుమారుడు రమేష్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ హత్య వెనుక కుటుంబ కలహాలే కారణమా, లేక ఆస్తి వివాదాలు ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. జనసమ్మర్ధం ఎక్కువగా ఉండే ప్రాంతంలో జరిగిన ఈ ఘటన స్థానికులను భయాందోళనకు గురి చేసింది.

## బోడుప్పల్లో ట్రాఫిక్ పోలీస్

# అధికారి నియామకం



**(నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎఫెక్ట్**


25 Nov 2025 - Page 9

9 నీలగిరి ఎక్స్‌ప్రెస్ మంగళవారం 25 నవంబర్ 2025

ట్రాఫిక్ సమస్యలు తీవ్రతరం

అంబేద్కర్ కూడలి దగ్గర ట్రాఫిక్ జామ్

ట్రాఫిక్ జామ్ ఇరుక్కుపోయిన 108 వాహనం

ఇబ్బందుల్లో ప్రజలకు

బోడుప్పల్, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్) బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం నుండి సాయిబాబా ఆలయం వీరరెడ్డి నగర్ చౌరస్తా వరకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రద్దీ సమయంలో ట్రాఫిక్ అధికారులు ఉంటే సమస్య కొంతవరకు తగ్గుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. భారీ వాహనాలు లారీలు, డీసీఎంలు, టిప్పర్లు ఈ రద్దీకి ప్రధాన కారణమని చెబుతున్నారు. ఉప్పల్ మార్గంలో నో ఎంట్రీ ...

Contact 7386 400 400

నిరుపయోగంగా ఉన్న ట్రాఫిక్ అధికారి స్టాండ్...

ఉండటంతో అవి బోడుప్పల్ మార్గాన్ని ఎంచుకోవడం ట్రాఫిక్ జామ్‌ను మరింత పెంచుతోంది. శనివారం సాయంత్రం అత్యవసర వాహనం 108 కూడా ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన ఘటన స్థానికులను ఆందోళనకు గురి చేసింది. ప్రతి సోమవారం రోజున సాయిబాబా ఆలయం నుండి మల్లన్న ఆలయం హెచ్‌పీ పెట్రోల్ బంక్ వరకు ప్రధాన రహదారి ఇరువైపులా కూరగాయల మార్కెట్, చిన్న వ్యాపారాలు జరుగుతుండటంతో రద్దీ మరింత పెరుగుతోంది. ఆర్టీసీ బస్సులు ఇంద్రనగర్ కాలనీకి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకోవడం, సోమవారం రోజున వీరరెడ్డి నగర్ చౌరస్తా వద్దే దింపడం, మలుపు తిప్పే ప్రయత్నంలో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోతుంది. స్థానికులు ఎన్నిసార్లు సూచించినప్పటికీ ఆర్టీసీ డ్రైవర్లు బయ్యానగర్ కాలనీ, హెచ్‌పీ పెట్రోల్ బంక్ దగ్గర ఉన్న ఖాళీ స్థలాన్ని ఉపయోగించకుండా రద్దీ ప్రాంతంలోనే బస్సులను తిప్పడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బోడుప్పల్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బోడుప్పల్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. వీరరెడ్డి నగర్ కాలనీ చౌరస్తాలో ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్ అధికారిని నియమించారు. గత కొన్ని నెలలుగా అంబేద్కర్ బొమ్మ చౌరస్తా, వీరరెడ్డి నగర్ కాలనీ చౌరస్తాలో ఉదయం, సాయంత్రం పూట తీవ్ర రద్దీ ఏర్పడి వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సేవల వాహనాలు కూడా ట్రాఫిక్‌లో ఇరుక్కుని రోగులు ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. బంగారు మైసమ్మ గుడి నుండి మల్లన్న గుడి, మల్లాపూర్ వైపు వెళ్లే రహదారి మూసివేయడం ప్రధాన కారణమని స్థానికులు పేర్కొన్నారు. అయితే, ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ పోలీస్ అధికారి నియామకం చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థులకు బస్సు

# సౌకర్యం ఏర్పాటు చేయండి

**- సర్పంచ్ నర్సింహతో కలిసి తెలంగాణ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కు వినతిపత్రం అందించిన ఎల్ఎన్ రెడ్డి**



**ఆమనగల్లు, మే 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మక్తమాధారం, రేఖ్య తండా మరియు కడ్తాల్ గ్రామాల నుండి ఇబ్రహీంపట్నం వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ లక్ష్మీ నర్సింహ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలతో కలిసి శుక్రవారం హైదరాబాద్ నగరం బస్ భవన్ లో తెలంగాణ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ శ్రీదేవిని కలిసి సమస్యలను వివరించారు. ప్రతిరోజు మక్తమాదారం కడ్తాల్ గ్రామాల నుండి ఉన్నత విద్య కోసం విద్యార్థులు ఇబ్రహీంపట్నంకు పదుల సంఖ్యలో ప్రయాణం చేస్తున్నారని వీరికి సరైన సమయంలో బస్సులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు మేనేజర్ కు వివరించినట్లు తెలిపారు. ఉన్నత విద్య కోసం ఇబ్రహీంపట్నం వెళుతున్న విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం 7గంటలలోపు మాదారం నుండి కడ్తాల్ మీదుగా ఇబ్రహీంపట్నం వరకు ప్రస్తుత ఉన్న ఇబ్రహీంపట్నం డిపో బస్సును కొనసాగిస్తూ, తిరుగు ప్రయాణం కొరకు సాయంత్రం 4 గంటలకు ఇబ్రహీంపట్నం నుండి బయలుదేరి, కడ్తాల్ మీదుగా మాదారం వరకు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని మేనేజర్ ను కోరినట్లు తెలిపారు. అదేవిధంగా ఫలక్ నుమా డిపోకు చెందిన బస్సు కొత్తపేట నుండి మాదారం వరకు పొడిగించాలని కోరినట్లు తెలిపారు. విద్యార్థులకు మరియు ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో మక్తమాదారం మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, సత్యనారాయణ గౌడ్, మల్లేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

# గ్రంథాలయ దినోత్సవం




**హయత్‌నగర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక విద్య వారోత్సవాలలో భాగంగా హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐదవ రోజు గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో మన గ్రంథాలయ జ్ఞానోత్సవం -- విశ్వ గ్రంథాలయ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన, బుక్ టాక్స్, పుస్తక దాన కార్యక్రమం, ఉత్తమ పాఠకుల సన్మానం, గ్రంథాలయ సేవల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ అధ్యాపక పాఠకుడిగా విద్యాసాగర్, ఉత్తమ విద్యార్థి పాఠకురాలిగా ఆదిత్య (బిఎ రెండవ సంవత్సరం) ఎంపికయ్యారు. పుస్తక దాతలుగా శుభాసిని, డాక్టర్ గీత నాయక్, డాక్టర్ వెంకటేశ్వర్లు సన్మానం పొందారు. గ్రంథపాలకుడు డా. ఎ. దుర్గాప్రసాద్ పోటీ పరీక్షలు, డిగ్రీ, పీజీ ప్రవేశ అవకాశాలు, భవిష్యత్ సబ్జెక్టులపై విద్యార్థులు, తల్లిదండ్రులకు సమగ్రంగా వివరించారు. చదువు అలవాటు, గ్రంథాలయ వినియోగం విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా భారత రాజ్యాంగానికి సంబంధించిన అరుదైన ప్రతిని ప్రదర్శించగా, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పరిశీలించి గ్రంథపాలకుల కృషిని అభినందించారు. ప్రిన్సిపాల్ డా. పి. సురేష్ బాబు మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞానం, ప్రేరణ, వ్యక్తిత్వ వికాసానికి కేంద్రబిందువులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ దినోత్సవం విద్యార్థుల్లో పఠనాసక్తి, జ్ఞానార్జన, విలువల విద్యకు కొత్త ఉత్సాహాన్ని నింపింది.

## ఘనంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్

# మమతా రెడ్డి జన్మదిన వేడుకలు



**పెద్దపల్లి, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పెద్దపల్లి పట్టణంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మమతా రెడ్డి కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులు, అభిమానుల ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. నాయకులు పూలమాలలు, శాలువాలతో మమతా రెడ్డిని సన్మానించారు. ఈ వేడుకలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఈ-కంప్యూటర్స్

# ఆన్లైన్ లైబ్రరీ పై అవగాహన




**ఆమనగల్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ఆమనగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి ఆధ్వర్యంలో కంప్యూటర్ లెక్చరర్ హరీష్, ఇంగ్లీష్ లెక్చరర్ రాజు, కామర్స్ లెక్చరర్ గోపాల్ విద్యార్థులకు ఈ-కంప్యూటర్స్ ఆన్లైన్ లైబ్రరీ వినియోగంపై వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని డిజిటల్ లెర్నింగ్ అవకాశాలపై అవగాహన పొందారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ జన్మదిన వేడుకలు



**గన్నేరువరం, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గన్నేరువరం మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. గంప వెంకన్న మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ నేత రసమయి బాలకిషన్ రాబోయే రోజుల్లో కెసిఆర్ నాయకత్వంలో మంత్రి పదవి అధిరోహించాలని ఆకాంక్షించారు. వేడుకల్లో బీఆర్ఎస్ మండల నాయకులు పుల్లెల లక్ష్మణ్, న్యాత సుధాకర్, మీసాల ప్రభాకర్, కుసుంబా నవీన్, గుండెల ఆంజనేయులు, కొట్టె భూమయ్య, జక్కనపెల్లి సత్తయ్య, సమ్మెట అనిల్, బోయిని అంజయ్య, బొడ్డు శ్రీను, దుగ్గల్ నరేష్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను ఉత్సాహభరితంగా నిర్వహించారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు



**కరీంనగర్ రూరల్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. చేగుర్తి గ్రామానికి చెందిన ఎలకపెల్లి సందీప్, బొడ్డు శ్రీకాంత్ తమ ట్రాక్టర్లలో మానేరు వాగు నుండి ఇసుకను దొంగలించి కరీంనగర్ వైపు తరలిస్తుండగా బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద మరియు చేగుర్తి గ్రామం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పలుమార్లు పట్టుబడితే సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. అక్రమ రవాణాపై పోలీసులు ముమ్మర చర్యలు కొనసాగిస్తున్నారని అధికారులు తెలిపారు.

# గ్రంథాలయాలు జ్ఞానానికి పునాది



**పెద్దపల్లి, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జరుగుతున్న ఎడ్యుకేషన్ వీక్‌లో ఐదవ రోజు గ్రంథాలయాలు -- జ్ఞానానికి పునాది, పఠన సంస్కృతికి మార్గదర్శి అనే అంశంపై జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద పాల్గొన్నారు. పుస్తక ప్రదర్శనలు, సమీక్షలు, చర్చా వేదికలు, అవగాహన కార్యక్రమాలను పరిశీలించారు. చైర్మన్ అన్నయ్య గౌడ్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత కోసం రూ.5 కోట్ల వ్యయంతో ఆధునిక గ్రంథాలయ భవనం నిర్మిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 253 పుస్తక ప్రదర్శనలు, 224 సమీక్షా సమావేశాలు, 171 అంశ చర్చలు, 143 డిజిటల్ లైబ్రరీ అవగాహన కార్యక్రమాలు, 27 పుస్తక దాన కార్యక్రమాలు నిర్వహించగా 1,969 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారని వివరించారు. జిల్లా విద్యాశాఖాధికారి శారద మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపయోగపడే పుస్తకాలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రంథాలయం తన జీవితానికి మార్గదర్శకమైందని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్. మల్లేష్, డాక్టర్ పి.ఎం. షేక్, జి. కవిత, కమల్, గ్రంథపాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయాలు పఠన సంస్కృతిని పెంపొందించి యువతకు విజ్ఞానానికి మార్గదర్శిగా నిలుస్తున్నాయి.

# ఘనంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్కృతి

## -- ప్రెస్ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమం



**బండన్నేట్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల బండన్నేట్లో సంస్కృతి -- ప్రెస్ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. చ. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రెస్ మిత్రులను శాలువాలతో సన్మానించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు సంస్కృతి, సామాజిక అవగాహన, విలువల విద్య అవసరమని పేర్కొన్నారు. కళాశాలలో జరుగుతున్న విద్యా, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా. రాజ్‌కుమార్, ఐక్యాక్ కోఆర్డినేటర్ డా. రామరాజ్ మాట్లాడుతూ మీడియా సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తిగా నిలుస్తుందని, విద్యాసంస్థల కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ప్రెస్ మిత్రుల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డా. వెంకటరెడ్డి విద్యార్థుల్లో సామాజిక బాధ్యతాభావం పెంపొందించేందుకు కళాశాల నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. కెరీర్ గైడెన్స్ సెల్ డా. జ్యోతి సంస్కృతి కార్యక్రమం విద్యార్థుల్లో సంప్రదాయాలు, నైతిక విలువలపై అవగాహన పెంపొందిస్తుందని వివరించారు. స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నర్సింహరాజ్ విద్యార్థుల అభివృద్ధిలో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కీలకమని అన్నారు. ఫిజిక్స్ విభాగం అధ్యాపకులు "సంస్కృతి" వంటి కార్యక్రమాలు ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగం నర్సింహ, ఇంగ్లీష్ విభాగం డా. రేవతి సురేందర్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. చివరగా ప్రిన్సిపాల్ డా. చ. ప్రసాద్ ప్రెస్ మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా కళాశాల కార్యక్రమాలకు మీడియా సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు. సంస్కృతి కార్యక్రమం విద్యార్థుల్లో జ్ఞానం, విలువలు, సామాజిక బాధ్యతాభావాన్ని పెంపొందించే వేదికగా నిలుస్తోంది.

# చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

## - కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో రైతు వద్ద ఉన్న చివరి గింజ వరి, మొక్కజొన్న పంటను మద్దతు ధరతోనే కొనుగోలు చేస్తామని కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం చేశారు. పెద్దకల్వలలోని అన్నపూర్ణ రైస్ మిల్, పెద్దబొంకూరు రాఘవేంద్ర రైస్ మిల్‌తో పాటు పలు మిల్లులను, పెద్దపల్లి మార్కెట్ యార్డ్‌ను కలెక్టర్, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం వచ్చే అవకాశం ఉందని, ఇప్పటివరకు 1.6 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి రూ.280 కోట్ల చెల్లింపులు చేశామని తెలిపారు. రోజువారీ కొనుగోళ్లు 13 వేల మెట్రిక్ టన్నుల వరకు పెరిగాయని, మే 20 నాటికి 80 శాతం కొనుగోళ్లు పూర్తవుతాయని చెప్పారు. తాజా వర్షాలకు తడిసిన 700 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా మద్దతు ధరతోనే కొనుగోలు చేశామని, గన్నీ సంచులు తీసుకువచ్చిన రైతులకు ఒక్కో సంచికి రూ.21 చెల్లిస్తున్నామని తెలిపారు. హమాలీల కూలీని రూ.6 నుంచి రూ.8.50కు పెంచామని, రవాణా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో 18 వేల ఎకరాల్లో సాగిన మొక్కజొన్నకు 8 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, రైతులు ట్రాక్టర్ల ద్వారా తరలించినా రవాణా చార్జీలు చెల్లిస్తున్నామని కలెక్టర్ వివరించారు. రైతు వద్ద ఉన్న చివరి గింజ వరి, మొక్కజొన్న పంటను మద్దతు ధరతోనే కొనుగోలు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

## అధికారులందరూ క్షేత్రస్థాయిలో

# చురుకుగా పనిచేయాలి

## - ఎమ్మెల్యే గిత్త జయసూర్య



**నందికొట్కూరు, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికగా నిర్వహించిన ప్రజా దర్బార్కు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య హాజరయ్యారు. గ్రామ ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు, వినతులు స్వీకరించిన ఆయన, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. "ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కారం కావాలి. అధికారులందరూ క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలి" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీవో శర్మ, ఈవో నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్



**నంద్యాల, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్లో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ప్రజల వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తాగునీరు, రహదారులు, పింఛన్లు, రెవెన్యూ, గృహ నిర్మాణం, విద్యుత్, సంక్షేమ పథకాలు వంటి సమస్యలను ప్రజలు నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. "ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో చేపట్టిన 'వన్ మంత్ -- ఫోర్ విజిట్' కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతుంది" అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

# ఘనంగా వైద్యుల అంజన్ కుమార్ జన్మదిన వేడుకలు



**కరీంనగర్, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కార్పొరేషన్ డిసిసి అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్.ఆర్.ఆర్. కళాశాల మైదానంలో కాంగ్రెస్ నాయకులు వీరదేందర్ పటేల్ ఆధ్వర్యంలో వాకర్స్‌తో కలిసి కేక్ కట్ చేసి రాగి జావా పంపిణీ చేశారు. కార్పొరేటర్ గంట కళ్యాణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంజన్ కుమార్ స్వయంగా కేక్ కట్ చేశారు. ఇందిరా చౌక్, టవర్ సర్కిల్, మంచిర్యాల చౌరస్తా, రాజీవ్ చౌక్, నాకా చౌరస్తా, మల్కాపూర్, శాతవాహన యూనివర్సిటీ, కొత్తపల్లి మండల కాంగ్రెస్ కార్యాలయం వంటి ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు, కార్పొరేటర్లు, నాయకులు, అభిమానులు పాల్గొని కేక్ కట్ చేసి అన్నదానం, మజ్జిగ పంపిణీ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వరాల నరసింగం, కాంతార జగన్ రెడ్డి, మదుపు మోహన్, మహమ్మద్ ఇమ్రాన్, కంకణాల అనిల్ కుమార్, సిరిపురం మనోజ్ కుమార్, పిట్టల సంతోష్, ఫహద్, శ్యాం సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నగరవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా పాల్గొనడంతో అంజన్ కుమార్ జన్మదిన వేడుకలు ఉత్సాహభరితంగా జరిగాయి.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య




**నందికొట్కూరు, మే 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.25,126 చెక్కును నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామానికి చెందిన బట్టు శ్రీకాంత్కు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, సున్నంపల్లి శ్రీనివాసులు, గోకారి, అధికారులు పాల్గొన్నారు.

## మనమిత్ర వాట్సాప్ ద్వారా

# దర్శనం, ఆర్జితసేవా టికెట్లు



**శ్రీశైలం, మే 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భక్తులకు సౌకర్యం కల్పించేందుకు శ్రీశైల దేవస్థానం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. మనమిత్ర వాట్సాప్ ద్వారా స్పర్శదర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం టికెట్లు పొందే అవకాశం కల్పించామని కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 18 రకాల ఆర్జితసేవలు -- గర్భాలయ అభిషేకం, సామూహిక అభిషేకం, కుంకుమార్చన, గణపతి హోమం, రుద్రహోమం, మహామృత్యుంజయ హోమం, చండీహోమం, కల్యాణోత్సవం, అన్నప్రాశన, అక్షరాభ్యాసం మొదలైన సేవలకు సంబంధించిన టికెట్లు కూడా ఈ ప్లాట్‌ఫారమ్ ద్వారా పొందవచ్చన్నారు. అదేవిధంగా విరాళాలు చెల్లించే సౌకర్యం, పరోక్షసేవలు నిర్వహించే అవకాశం కూడా మనమిత్ర ద్వారా అందుబాటులో ఉందని తెలిపారు. "ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ విధానం పారదర్శకంగా, వేగంగా సేవలు అందించేందుకు ఉపయోగపడుతుంది" అని ఆయన పేర్కొన్నారు. భక్తుల అవగాహన కోసం క్షేత్ర పరిధిలో మనమిత్ర బోర్డులు, క్యూ కాంప్లెక్స్ ఎదురుగా, సి.ఆర్.ఓ కార్యాలయం, గణేశసదన్ వద్ద మనమిత్ర సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన మనమిత్ర వాట్సాప్ నంబరు: 9552300009 ద్వారా భక్తులు దర్శనం, సేవా టికెట్లు, ప్రసాదాలు, విరాళాలు పొందవచ్చని ఆయన సూచించారు.

# బిజినెస్

## అత్యంత కనిష్టానికి పడిపోయిన రూపాయి..
# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్

భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. రూపాయి విలువ అత్యంత కనిష్టానికి పతనమవడం, క్రూడాయిల్ ధరలు పెరగడం మార్కెట్లపై దుష్ప్రభావం చూపింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 160.73 పాయింట్లు (0.21 శాతం) నష్టపోయి 75,237.99 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ50 కూడా 46.10 పాయింట్లు (0.19 శాతం) నష్టపోయి 23,643.50 వద్ద ముగిసింది.రూపాయి విలువ తగ్గడం, చమురు ధరలు పెరుగుదల, ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయం వంటివి ఇన్వెస్టర్లపై ప్రభావం చూపాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు ఇంకా కొనసాగడం, హోర్ముజ్ జలసంధి పూర్తి స్థాయిలో తెరుచుకోకపోవడం వంటివి కూడా ఇందుకు కారణాలు. ఈ కారణాలతో చమురు ధరలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయంగా బ్యారెల్



క్రూడాయిల్ ధర 109 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మరోవైపు భారతీయ రూపాయి అత్యంత కనిష్ట స్థాయికి చేరింది. డాలర్‌తో రూపాయి విలువ 96.05 వద్ద ట్రేడవుతోంది. అంతకుముందు ఇది 95.9575 వద్ద కొనసాగింది. రూపాయి అత్యంత తక్కువ స్థాయికి చేరుకోవడం కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది. రూపాయి ఇంత తక్కువ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. ఈ రోజు 0.3 శాతం తగ్గింది. చమురు ధరల పెరుగుదల, విదేశీ ద్రవ్యం అధికం కావడం, పశ్చిమాసియాలో అస్థిరత వంటివి రూపాయి పతనానికి కారణాలు. ఇండియా చమురు దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతున్న సంగతి తెలిసిందే. అలాగే, అమెరికా వడ్డీ రేట్లు, మారక నిల్వలు తగ్గడం కూడా కారణాలుగా చెప్పుకోవచ్చు.

## బంగారం ప్రియులకు ఊరట
# భారీగా తగ్గిన పసిడి ధరలు!

### గోల్డ్, సిల్వర్ రేట్స్.. భారీగా ధరల పతనం



ఇంటర్నెట్ డెస్క్

భారత్‌లో బంగారం ధరల ర్యాలీకి బ్రేక్ పడినట్టు కనిపిస్తోంది. అంతర్జాతీయ అనిశ్చితులు, కేంద్రం దిగుమతి సుంకాల పెంపు నేపథ్యంలో నేడు బంగారం, వెండి ధరల్లో భారీ కోత కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, (మే 15) ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,090కు పడిపోయింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధరలో ఏకంగా రూ.2,240ల మేర కోత పడింది. 22 క్యారెట్ల పసిడి ధర కూడా రూ.1,46,750కు చేరుకుంది. నిన్నటితో పోలిస్తే ధర రూ.2,050ల మేర తగ్గింది. నగరంలో వెండి ధరలో కూడా రూ.10 వేల కోత పడింది. ప్రస్తుతం కిలో వెండి రూ.3.05 లక్షల వద్ద ట్రేడవుతోంది ఇతర ప్రధాన నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,63,390గా ఉంది. ఢిల్లీలో రూ.1,60,240గా, ముంబైలో రూ.1,60,090 వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,49,500గా, ఢిల్లీలో రూ.1,46,900గా, ముంబైలో రూ.1,46,750గా ఉంది. చెన్నై సహా పలు నగరాల్లో వెండి దర రూ.3.05 లక్షల వద్ద ట్రేడవుతోంది. నిన్నటితో పోలిస్తే దేశంలో కిలో వెండి ధర రూ.10 వేల మేర తగ్గింది.

# బీఎస్ఎన్ఎల్ సరికొత్త చౌక ప్లాన్..


### రూ. 225కే అపరిమిత డేటా, కాలింగ్



ప్రైవేట్ టెలికాం సంస్థల ధరల పెరుగుదల నేపథ్యంలో, ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ సామాన్యులకు ఊరటనిచ్చేలా సరికొత్త ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. కేవలం రూ. 225 ధరతో ప్రవేశపెట్టిన ఈ ప్లాన్, డేటా ఎక్కువగా వాడే యూజర్లను దృష్టిలో ఉంచుకుని రూపొందించారు. ఈ ప్లాన్ ద్వారా నెలకు సుమారు 75 జీబీ డేటాను బీఎస్ఎన్ఎల్ అందిస్తోంది. రోజుకు 2.5 జీబీ హై-స్పీడ్ డేటా లభిస్తుంది. అంటే నెలకు సుమారుగా 75 జీబీ డేటాను వినియోగించుకోవచ్చు. ఇక వ్యాలిడిటీ విషయానికి వస్తే.. ప్రైవేట్ సంస్థలు 28 రోజుల వ్యాలిడిటీ ఇస్తుండగా, బీఎస్ఎన్ఎల్ ఈ ప్లాన్ ద్వారా పూర్తి 30 రోజుల వ్యాలిడిటీని అందిస్తోంది. ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత కాల్స్ మాట్లాడుకునే సౌకర్యం, రోజుకు 100 ఎస్ఎంఎస్ లు కూడా ఈ ప్లాన్‌లో ఉన్నాయి. వర్క్ ఫ్రమ్ హోమ్ చేసే వారికి, ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యే విద్యార్థులకు తక్కువ ధరలో ఎక్కువ డేటా కోరుకునే వారికి ఈ ప్లాన్ ఒక వరం లాంటిది. రోజువారీ కోటా ముగిసిన తర్వాత కూడా తక్కువ వేగంతో ఇంటర్నెట్ సదుపాయం కొనసాగుతుంది. దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ తన నెట్‌వర్క్‌ను ఆధునీకరిస్తున్న తరుణంలో, ఈ చవకైన ప్లాన్ కస్టమర్లను భారీగా ఆకర్షిస్తుందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు.

## వన్డే ప్రపంచకప్ ఆడాలని ఉంది..
# కానీ, సెలెక్టర్లు ఏమంటారో..!

ఐపీఎల్‌లో తొమ్మిదో శతకంతో చెలరేగిన విరాట్ కోహ్లీ ఆట చూస్తుంటే మరో రెండేళ్లు అతడికి తిరుగులేదని అనిపిస్తోంది. వరసగా రెండు గోల్డెన్ డకౌట్‌ల నుంచి తేరుకొని సెంచరీతో విరుచుకుపడిన కోహ్లీ వన్డే వరల్డ్ కప్‌లో ఇలానే ఆడితే చూసి తరించాలని అభిమానులు అనుకుంటున్నారు. విరాట్ సైతం ప్రపంచకప్ ఆడాలనే ఉద్దేశంతోనే ఉన్నట్టుగా తెలుస్తోంది. ఆర్సీబీ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. 'దేశం తరపున వరల్డ్‌కప్ ఆడడం కంటే గొప్ప విషయం ఏముంటుంది' అని కోహ్లీ నవ్వుతూ బదులిచ్చాడు.అంతర్జాతీయ క్రికెట్‌లో టన్నుల కొద్దీ పరుగులు.. వన్డేల్లో శతకాల ఫిఫ్టీతో రికార్డులు నెలకొల్పిన విరాట్ కోహ్లీ తదుపరి లక్ష్యం? ఏంటో తెలుసా.. వన్డే ప్రపంచ కప్. ఐపీఎల్ పద్దెనిమిదో సీజన్‌తో ఆర్సీబీ కలను సాకారం చేసిన విరాట్ వచ్చే ఏడాది ప్రపంచకప్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. ఆస్ట్రేలియా పర్యటన, ఆపై స్వదేశంలో దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో శతకాలతో రెచ్చిపోయిన అతడు.. దేశవాళీ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలోనూ దంచేశాడు. ఇప్పుడు ఐపీఎల్ 19లోనూ కుర్రాడిలా రెచ్చిపోతున్నాడు. అతడి ఫామ్ చూస్తుంటే వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ కప్ ఆడేలా ఉన్నాడు? అని అందరూ అనుకుంటున్నారు. ఇదే విషయంపై



ఆర్సీబీ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. నాకు ప్రపంచకప్ ఆడాలనే ఉంది అని మనసులోని మాట చెప్పేశాడు.మైదానంలోకి దిగాక జట్టులో ఉత్సాహం నింపడం, విజయంలో భాగమవ్వడం మీదే నా దృష్టంతా ఉంటుంది. నన్ను నేను నిరూపించుకోవాలని ఆడను. నేను ఇప్పుడు ఆ పరిస్థితిలో లేను కూడా. ఎందుకంటే మ్యాచ్ సన్నద్ధత పట్ల, మైదానంలోకి దిగాక ఎలా ఆడాలి? అనే విషయాల పట్ల నేను నిజాయతీగా ఉంటాను. అందుకని తల కిందకు వంచి.. నెట్స్‌లో కష్టపడతాను. నా క్రికెట్ కెరీర్‌లో అన్నీ ఇచ్చినందుకు ఆ దేవుడికి కృతజ్ఞతలు. నాకు అవకాశం వచ్చినందుకు ఎంతో గర్వపడతాను. ఇక ఆట విషయానికొస్తే.. వన్డేల్లో 40 ఓవర్ల పాటు బౌండరీ నుంచి అవతలి బౌండరీ వరకూ పరెగెత్తమని చెప్పినా.. నేను పరుగెడుతాను.యాభై ఓవర్లకు తగ్గట్టుగా నేను సన్నద్ధమవుతా. నేను ఎదుర్కొనే ప్రతి బంతిని ఇదే నా కెరీర్లో చివరి బంతి అనుకుంటూ బ్యాటింగ్ కొనసాగిస్తా. అంతేనా.. వికెట్ల మధ్యలో చకచకా పరుగుతీస్తా. జట్టుకు అవసరమైన ప్రతిదీ చేసేందుకు నేను ఎల్లప్పుడూ సిద్ధమే. విజయ్ హజారే ట్రోఫీలో గొప్పగా ఆడాను. వరల్డ్‌కప్ గురించి అడిగితే.. నాకూ ఆడాలనే ఉంది. కానీ, అది నా ఒక్కడి నిర్ణయం సరిపోదు. జట్టుకు కూడా నా అసవరం ఉందని సెలెక్టర్లు అనుకోవాలి. అప్పుడే వరల్డ్‌కప్ ఆడగలను' అని విరాట్ పేర్కొన్నాడు.రెండేళ్ల క్రితం టీ20, టెస్టులకు వీడ్కోలు పలికిన విరాట్.. ప్రస్తుతం అంతర్జాతీయంగా వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. 2011లో ధోనీ సారథ్యంలో వరల్డ్‌కప్ గెలిచిన జట్టులో సభ్యుడైన విరాట్.. ఇటీవల రోహిత్ శర్మ కెప్టెన్సీలో ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలోనూ కీలకమయ్యాడు. అదే ఉత్సాహంతో 2027 వన్డే ప్రపంచకప్ ఆడి దేశానికి మరో ఐసీసీ ట్రోఫీ కట్టబెట్టాలని అతడు ఆశపడుతున్నాడు. అయితే.. మన సెలెక్టర్లు ఏం చేస్తారో చూడాలి.

# బీసీసీఐ రూల్స్‌లో ఊహించని ట్విస్ట్!

ఐపీఎల్ 2026 సీజన్ క్లైమాక్స్‌కు చేరుకుంది. మే 24తో లీగ్ దశ మ్యాచ్‌లు ముగియనుండగా.. మే 26 నుంచి ప్లేఆఫ్స్ సమరం మొదలవుతుంది. అయితే ఈ కీలక మ్యాచ్‌లకు వర్షం ముప్పు పొంచి ఉండటంతో క్రికెట్ అభిమానుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ప్లేఆఫ్ మ్యాచ్‌లకు సంబంధించి బీసీసీఐ రూపొందించిన ప్రత్యేక నిబంధనల గురించి తెలుసుకుందాం.సాధారణంగా నాకౌట్ మ్యాచ్‌లన్నింటికీ రిజర్వ్ డే ఉంటుందని అందరూ భావిస్తారు. కానీ బీసీసీఐ నిబంధనల ప్రకారం క్వాలిఫయర్-1, ఎలిమినేటర్, క్వాలిఫయర్-2 మ్యాచ్‌లకు రిజర్వ్ డేలు లేవు. కేవలం ఫైనల్ మ్యాచ్‌కు మాత్రమే రిజర్వ్ డే కేటాయించబడింది. అంటే మొదటి మూడు నాకౌట్ మ్యాచ్‌లను ఏ రోజున నిర్ణయించారో అదే రోజున ఫలితాన్ని తేల్చాల్సి ఉంటుంది. వర్షం పడితే ఆటను పూర్తి చేయడానికి లీగ్ మ్యాచ్‌ల కంటే అదనంగా 120 నిమిషాల సమయం కేటాయిస్తారు.ఒకవేళ ప్లేఆఫ్ మ్యాచ్ జరిగే రోజున వర్షం కురిస్తే అంపైర్లు మొదట 20 ఓవర్ల పూర్తి మ్యాచ్ నిర్వహించడానికి ప్రయత్నిస్తారు. అది సాధ్యం కాకపోతే ఓవర్లను తగ్గిస్తూ వచ్చి కనీసం 5 ఓవర్ల చొప్పున మ్యాచ్ జరిగేలా చూస్తారు. ఒకవేళ 5 ఓవర్ల మ్యాచ్ కూడా జరగని పక్షంలో కనీసం ఫలితం కోసం సూపర్ ఓవర్ నిర్వహించే అవకాశం ఉందో లేదో పరిశీలిస్తారు. మైదానం పరిస్థితి సహకరిస్తే సూపర్ ఓవర్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు.అదనపు సమయం తర్వాత కూడా వర్షం తగ్గకపోతే లేదా సూపర్ ఓవర్ కూడా నిర్వహించే అవకాశం లేకపోతే, బీసీసీఐ నిబంధనల ప్రకారం లీగ్ దశలో సాధించిన పాయింట్ల పట్టిక కీలకంగా మారుతుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న జట్టును విజేతగా ప్రకటిస్తారు. ఉదాహరణకు, క్వాలిఫైయర్-1లో మొదటి, రెండో స్థానాల్లోని జట్ల మధ్య మ్యాచ్ వర్షం వల్ల రద్దయితే, టేబుల్ టాపర్‌గా ఉన్న జట్టును నేరుగా ఫైనల్‌కు పంపిస్తారు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. మిగిలిన మ్యాచ్‌లతో పోలిస్తే ఫైనల్‌కు రూల్స్ కాస్త సరళంగా ఉంటాయి. ఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్ డే ఉన్నందున నిర్ణీత రోజున వర్షం వస్తే మరుసటి రోజు ఆటను కొనసాగిస్తారు. ఒకవేళ ఫైనల్ రోజున మ్యాచ్ సగం జరిగాక ఆగిపోతే.. రిజర్వ్ డే నాడు అక్కడి నుంచే ఆట ప్రారంభమవుతుంది. రిజర్వ్ డే నాడు కూడా వర్షం కారణంగా కనీసం 5 ఓవర్ల ఆట లేదా సూపర్ ఓవర్ సాధ్యపడకపోతే, అప్పుడు లీగ్ దశలో పాయింట్ల పట్టికలో టాప్ ప్లేస్‌లో ఉన్న జట్టును ఐపీఎల్ 2026 ఛాంపియన్‌గా ప్రకటిస్తారు.

# స్పోర్ట్స్

# పాకిస్థాన్‌కు బిగ్ షాక్..

### డబ్ల్యూటీసీలో ఏకంగా 8 పాయింట్లు కోత..!



బంగ్లాదేశ్ పర్యటనలో దారుణ ఓటమిని మరిచిపోకముందే పాకిస్థాన్ కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఢాకా టెస్టులో స్లో ఓవర్ రేటు కు పాక్ భారీ మూల్యం చెల్లించుకుంది. మ్యాచ్ ఫీజులో కోతతో పాటు ఆ జట్టు ర్యాంకింగ్‌లోనూ దిగజారింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో కీలకమైన పాయింట్లు కోల్పోయింది. ఒకటి రెండు కాదు ఏకంగా 8 పాయింట్లు కోతకు గురైంది షాన్ మసూద్ బృందం.ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో పాకిస్థాన్‌కు ఊహించని షాక్. బంగ్లాదేశ్ చేతిలో 104 పరుగుల తేడాతో తొలి టెస్టులో ఓటమి పాక్ ర్యాంకింగ్స్‌ను దెబ్బతీసింది. ఆ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేటు కారణంగా మ్యాచ్ ఫీజులో 40 శాతం కోల్పోయింది. నిర్ణీత సమయానికి ఎనిమిది ఓవర్లు వెనుకంజలో ఉండడంతో జరిమానా కింద డబ్ల్యూటీసీలో 8 పాయింట్ల కోత పడింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. న్యూజిలాండ్ రెండులో ఉంది. దక్షిణాఫ్రికా, శ్రీలంక, పాకిస్థాన్ వరసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచాయి.నహీద్ **విజృంభణతో..**

ఢాకా వేదికగా జరిగిన తొలి టెస్టులో పాకిస్థాన్ బ్యాటర్లను వణకిస్తూ బంగ్లాదేశ్ భారీ విజయాన్నందుకుంది. దమ్ముంటే మా ముందు 70 ఓవర్లలో 260పైగా లక్ష్యాన్ని నిర్దేశించండి అని సవాల్ విసిరిన సల్మాన్ అఘా తల పొగరను అణచివేస్తూ సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది.మొదటి ఇన్నింగ్స్‌లో కాస్తో కూస్తో పోరాడిన పాక్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కుప్పకూలింది. నహిద్ రాణా(5-40) బంతితో చెలరేగిన వేళ బంగ్లా 104 పరుగుల తేడాతో గెలుపొందింది. తద్వారా స్వదేశంలో పాక్‌పై బంగ్లాదేశ్ మొదటి విజయంతో చరిత్ర సృష్టించింది. ఇరుజట్ల మధ్య మే 16 నుంచి రెండో టెస్టు జరుగనుంది.